


రేడియోలోనుంచి వీణ సంగీతం సన్నగా హుషారుగా వస్తూంది.

దానికి లయబద్ధంగా పల్చని కిటికీతెరలు నాట్యం చేస్తున్నాయి. చదువుతూన్న పుస్తకం మూసేసి నిట్టూర్పు విడిచాడు సారథి. అల్లుతూన్న స్వెట్టరు పైనుంచి సారథివేపు చూపు నిల్పాను.

"ఒక క్షయరోగి చాలా క్షీణస్థితిలో హాస్పిటల్లో చేరాడు. పాపం, ఎవరూ లేనట్లుంది. ఒక కాలు లేదు. చివరిగడియల్లో ఉన్నాడు. అపస్మారకంలో 'సువర్ణా! సువర్ణా!' అని పిలుస్తూనే ప్రాణం వదిలాడు."

నా చేతులు క్షణం కంపించాయి. గుండె ఝల్లుమంది.

నావైపు చూస్తూ తిరిగి అన్నాడు. "నాకా క్షణాన ఏమనిపించిందంటే, నేనే అతనయి నీకోసం కలవరిస్తున్నాననిపించింది."

స్వెట్టర్ అవతలికి విసిరి, భయంతో వేగంతో కంపించే గుండెలతో సారథి దగ్గరగా వెళ్ళి కూర్చున్నాను.

"ఎంత పిరికిదానివి, సువర్ణా, నువ్వు! అలా ఎందుకు జరుగుతుంది? కాని ఆ అభాగ్యుని సువర్ణ ఎవరో కదూ, పాపం! అతని పిలుపు ఆమెకు వినబడనేలేదు. ఆమె ఎక్కడుందో?"

నా గుండెలు మరింత దడదడలాడాయి.

ఆ పిలుపు నాకోసం కాదు కదా!

కాదు, అసంభవం. అది నాకోసం కాదు.

లోకంలో సువర్ణ తనొక్కత్తే కాదు. కాని, అతను — అతను — రవీంద్ర — రవీంద్ర కాదు కదా! కాదు, రవీంద్ర — లేడు — అతను లేడు! అతను మరణించాడు.

ఎక్కడో దూరాన చిక్కుటడవులమధ్య భయంకర మైన మంచుకొండలదగ్గర ఎవరూలేని చోట అతను భయంకరంగా మరణించాడు. ఘోర విమాన ప్రమాదంలో నుసి నుసి అయిపోయాడు. ఇది సత్యం.

నా గుండెలు క్షణంలో తేలిగ్గా అయిపోయాయి.

"అత్తరువు సీసాలో దాచుకున్నట్లే జ్ఞాపకాలను కూడా దాచుకుంటే ఎంతో బాగుంటుంది. అవసర మైనప్పుడు సీసా తెరిచి, అత్తరువు వాసన చూసినట్లే జ్ఞాపకాలనుకూడా నెమరువేసుకోవచ్చు." ఎవరో ఒక ప్రఖ్యాత కవి వ్రాసిన ఆ వాక్యాలు చదివినా, గుర్తుకు వచ్చినా వణికిపోతాను నేను. మనస్సనే సీసాలో దాచుకొన్న జ్ఞాపక సుమాల పరిమళాన్ని నేను భరించలేను. ఆ వాసనకు నా తల తిరిగిపోతుంది.

భారంగా, భయంగా నిట్టూర్పు విడిచాను.

ప్రకృతి ఆ సన్నటి వెన్నెలలో చిత్రవిచిత్రంగా కనిపిస్తూంది. దూరంగా హాస్పిటల్లోని దీపాలు ఉజ్జ్వలంగా, నిశ్చలంగా వెలుగుతున్నాయి.

ఆ సన్నటి వెన్నెలలో హాస్పిటల్ భవనాలు భీకరంగా, తెల్లగా కనిపిస్తున్నాయి.

రవీంద్ర ఒక పల్చని నీడలా నా మనస్సులో ప్రవేశించాడు. అతని స్మృతి ఉనికితో నా మది గిజగిజ లాడిపోయింది.

అతని ఛాయ గడిచిపోయిన ప్రతి క్షణాన్ని నాలో తిరిగి గుర్తుకుతీసుకురావడానికి ప్రయత్నిస్తూంది. నేను వివశురాలనవుతున్నాను.

మరుగుపడిన జ్ఞాపకాలను తిరిగి స్మరించుకోవడం నాకేమిటో భయంగా ఉంది. ఆ స్మృతులన్నీ విషసిక్తములైనవి!

కొన్ని సంవత్సరాలక్రిందటి నా జీవితమే ఒక విషాదస్మృతి. ఆ స్మృతిని నా మనః ఫలకంనుండి పూర్తిగా తుడిచివేయడానికి విశ్వప్రయత్నం చేశాను. ఆ గాయం మానింది. ఆ స్మృతి గతించింది. ఆ అనుభవం మాయమైంది. ఆ దినాలు చెదిరిపోయాయి.

నా జీవనలతిక కొత్తచిగురు తొడిగింది. జీవితం కొత్త కొత్త అందాల్ని సంతరించుకొంది. స్నిగ్ధంలిలితమైన అందం అది. కాని ఈనాడు ఏదో ఒక అగాధం లోనికి, ఒక అంధకారంలోనికి పోతూన్నట్లుగా అయింది నా బ్రతుకు.

జీవితంలో విజయం సాధించాలంటే ఎవరైనాసరే అన్ని అగ్నిపరీక్షలకు నిలబడాలి. నేనూ జీవితంలో ఈ తీవ్రయాతన అనుభవించాను.

ఒంటరితనాన్ని, కష్టపు లోతులను చవిచూశాను. అంతా అనుభవించి వ్యధల బరువుతో, నిరాశా నిస్ప్రహలతో, నా జీవితం అల్లల్లాడిపోయింది. ఈ క్షణాన అనిపిస్తూంది, నన్నేకాదు ప్రతి స్త్రీని జీవితంలో ఏదో ఒక విధాన విధి వెక్కిరింపక మానదు. విధికి ఎదురీదవలిసిన అవసరం తప్పకపోవచ్చు. నన్ను విధి పరీక్షించింది. కాని, నేను నెగ్గాను. కారుచీకట్లు కమ్ముకున్న నా జీవితంలో సారథి దయవల్ల చీకట్లు విచ్చుకున్నాయి. ఆశగా భవిష్యత్తులోనికి ప్రవేశించాను.

ఆశ జీవితసౌధానికి పునాదిరాయి.

అతి భయంకరమైన పరిస్థితిలో జీవితంమీద ఆశ కల్పించి, నాలో కొత్త జీవం, కొత్త విశ్వాసం కలిగించాడు సారథి. ఈనాడు అతను నా జీవనదాత. నా జీవన కరదీపిక. అతి ప్రశాంతంగా సాగిపోతూన్న నా ఈ జీవననౌక చిత్రవిచిత్రమైన భయాలతో ఏ క్షణంలో ఏమవుతుందోననిపిస్తూంది. రవీంద్ర స్మృతే నా మనస్సును అల్లకల్లోలం చేసివేస్తూంది. ఒకవేళ రవీంద్రే బతికి వస్తే? నేనేం చెయ్యగలను? ఒకవేళ ఆ క్షణమే వస్తే?

ఆనాడు నేను రవీంద్రను పిచ్చిగా ప్రేమించాను. కాని ఈనాడు సారథిని ఆరాధిస్తున్నాను.

రవీంద్ర నా ప్రేమను గుర్తించలేదు. ప్రేమకు బదులు నా హృదయంలో ద్వేషాన్ని నింపాడు.

ఈ క్షణాన సారథి నా ప్రాణం, నా జీవితం, నా ప్రపంచం. నాకు తెలుసు. సారథి నా జీవన రథసారథి. తన చల్లని చిరునవ్వుతో నా జీవితాన్ని ఎల్లప్పుడూ వెన్నెలబాటలో నడిపిస్తాడు.

ఆనాటి దినాలు . . .

పట్నంలో పి. యు. సి. పరీక్షలు వ్రాసి ఇంటికి వస్తూంది. పచ్చని పొలాలగుండా తన పల్లెసీమ సౌందర్యాన్ని వీక్షిస్తూ, ఏవేవో మధురానుభూతులతో పరవశిస్తూ, ఊహిస్తూ ఆనందలహరిలోతేలియాడుతూ వచ్చింది. ఇంటిదగ్గిర బండి ఆగగానే ఆశ్చర్యపడింది. ఇల్లంతా కోలాహలంగా, సందడిగా ఉంది.

అందరూ నన్నతి శ్రద్ధగా, భక్తిగా ఆహ్వానించారు. కారణం ఊహించటం నాకు శక్యం కాలేదు. నాన్నగారిదగ్గిరికి వెళ్లాను. గుండెజబ్బుతో కృశించి ఉన్న నాన్నను చూడగానే నా దుఃఖం రగిలింది.

"తల్లీ, సువర్ణా, వచ్చావా!" ఆర్ద్రతతో నా తల నిమిరా రాయన.

"నాన్నా, ఏమిటీ హడావిడి? అంతా పెళ్లిసందడిలా ఉందేమిటి?" అమాయికంగా ప్రశ్నించాను.

నాన్న చిరునవ్వు నవ్వారు. ఆయన సమాధానానికి నివ్వెరపోయాను. ఊహాకే అందని ఆ నిజం నన్ను దిగ్భ్రమలో ముంచింది.

"నాకు తెలుసు, తల్లీ, నీవు ఆశ్చర్యపడతావని. నీ అభిలాష, ఉద్దేశ్యం నాకు తెలును. కాని ఏం చెయ్యను? లోకజ్ఞానం సరిగ్గా తెలియని నిన్ను ఈ లోకంలో

> **అత్తరుసీసాలో దాచుకున్నట్లే, జ్ఞాపకాలనుకూడా దాచుకోగలిగితే, అవసరమైనపుడు సీసా తెరిచి, జ్ఞాపకాలను వాసనచూడవచ్చు. మనసు అనే సీసాలో దాగిన జ్ఞాపకాల సుమాల పరిమళాన్ని పురుషుడు భరించలేడు. ఎంత ఘాటు వాసనలనైనా భరించగలది మగనిచాటు మగువమాత్రమే.**

ఒంటరిగా విడిచి, నేనెలా వెళ్లగలను? నీకు తెలీదు, తల్లీ, నా జీవితం ఇక కొద్ది దినాలే."

"నాన్నా!" భయంగా ఆయన్ని పట్టుకున్నాను.

"అందుకే ఈ పిచ్చినాన్న మాట కాదనకు. నా చేతులతో నిన్నొక ఇంటిదాన్ని చెయ్యనియ్యి. నాకా తృప్తి కలిగించు."

మొదటిసారిగా నాన్న కళ్లల్లోని కన్నీరు చూసి ఆయన కోరిక కాదనలేకపోయాను.

ఫలితంగా ఆయన ప్రాపకంలో పెరిగి, పెద్దఅయి చదువుతూన్న రవీంద్రతో నా ఇష్టాలతో నిమిత్తం లేకుండా పెళ్లి చేసేశారు. ఆ తరవాత అనుకున్నట్లుగానే నాన్న చనిపోయారు.

రవీంద్ర యూనివర్సిటీలో రిసెర్చి చేస్తున్నాడు. ఆ సమయంలో, పదహారేళ్లప్రాయంలో వివాహం, భర్త అనే విషయాల్లో నిశ్చితమయిన భావమేదీ సరిగ్గా నాలో స్థిరపడలేదు. జీవితమంటే ఒక అర్థంకాని, ప్రత్యేకమైన భావనకాని ఏర్పడని ఆ వయస్సులో రవీంద్ర అనే ఒక హృదయంలేని జడపదార్థానికి అర్ధాంగిగా నా బాధ్యత ఏమిటో నాకు అవగాహన అయ్యేదికాదు. రవీంద్రను అర్థంచేసుకోవాలని ప్రయత్నించాను. కాని అతని ప్రవర్తన ప్రతీ పనిలోను నన్ను వెనక్కి నెట్టింది. ఫలితంగా అతనొక సమస్య అయ్యాడు. కాని అతన్ని పిచ్చిగా ప్రేమించసాగాను. నాకు తెలుసు. ఆ ప్రేమకు అవధులు లేవు.

తెలిసీ తెలియని ఆ వయస్సులో పురోహితులు ఉచ్చరింపచేసిన ఆ మంత్రాలు ఉచ్చరించాను. దానితో నా శరీరంలోని ప్రతి రక్తాణువు మారిపోయింది.

రవీంద్ర — అతనికోసం, అతని క్షేమంకోసం, అతని ప్రేమకోసం నా హృదయం తహతహలాడింది.

రవీంద్ర సాహచర్యంలో వైవాహిక జీవితంలోని మాధుర్యాన్ని ఆస్వాదించాలని ఎన్నో కలలు కన్నాను. కాని రవీంద్రనుండి ఏ విధమైన భావం వచ్చేదికాదు. ప్రపంచంలో అన్నిటికన్నా విలవఅయిన ఆనందం కోసం, భర్త ప్రేమ మృదువచనాలకోసం అనుక్షణం నేను వీక్షించాను. రవీంద్రతోబాటు విహంగమునై గగనవీథుల్లో విహరించాలనే నా తపన, కోరిక అది క్షణక్షణానికి రవీంద్ర ప్రవర్తనతో మరీ మరీ ఎక్కువ కాసాగింది.

కాని రవీంద్ర లోకం వేరు. అతని తపన వేరు.

**బి. ప్రేమలీల**

ఎప్పుడూ తన థీసిస్ రిసెర్చి—యూనివర్సిటీ.

విజ్ఞానతృష తో వెలిగిపోయే అతని కళ్ళ దేన్నో సాధించాలనే ఆశయం

బహుశా అతను గుర్తించిఉండడు, నాకూ ఒక లోకం ఉందని. అందులో తనకోసం సువర్ణ తన హృదయకవాటాలను తెరుచుకొని ఎదురుచూస్తూందనే తలంపు బహుశా అతని మనస్సులో ఏ మూలనైనా ఉంటుందనే భావంకూడా నా ఊహాకు మించినది.

చివరికి రవీంద్ర ప్రవర్తనతో విసుగెత్తిపోయాను. జీవితం అంటే తెలియని ఆ రోజుల్లో జీవితంలోని మధురానుభూతులను చవిచూడాలనే, ఏవేవో పొందాలనే తపన, ఆరాటం నన్ను జీవచ్ఛవంగా చేసేశాయి. నా కోరికలకు, ఆశలకు, అవకాశాలకు సామ్యం లేనప్పుడు జీవితం చప్పగా అయిపోయింది. ఫలితంగా రవీంద్రపై ఒక విధమైన జుగుప్స, ద్వేషం కలగసాగింది. ప్రేమకు బదులు ద్వేషం నిండింది. జీవిత సౌధాన్ని తీర్చిదిద్దేది ప్రేమ. జీవితం సఫలమైనా, విఫలమైనా కారణం ప్రేమ. కాని ఈనాడు నాకు అనిపిస్తూంది, ప్రేమించడానికి, ప్రేమను స్వీకరించడానికిఅందరూ అర్హులు కారు. ప్రేమ పరిపూర్ణం కానినాడు దానిమీద నమ్మకం సడలిపోతుంది. అది ఏ ఒక్కనాటికీ నిలవదు. నిలిచినా ద్వేషంగా మారుతుంది. జీవితాన్ని విషతుల్యం చేస్తుంది.

రవీంద్రతో నేను గడిపిన కాలం ఒక్క సంవత్సరం. అతను నాతో మాట్లాడిన మాటల్లో "ఆఁ! ఊఁ!" లు తప్ప అంతకుమించి మరేవి ఉండేవికావు. దీక్షగా రాత్రింబగళ్లు చదువుతూ, థీసిస్ వ్రాస్తూ తన ఉనికినే మరిచిపోయేవాడు. నా గుండెలు భగభగలాడి పోతూండేవి. నా సమస్తమైన ఆనందాల్ని నాశనం చేస్తున్న ఆ థీసిస్సును కచ్చతో కాల్చిపడెయ్యాలని ప్రయత్నించాను. కాని నిర్మలము, స్నిగ్ధము అయిన రవీంద్ర మొహాన్ని చూసి ఏమి చెయ్యలేకపోయేదాన్ని. అతను నా భర్త. మనోవాక్కాయకర్మలా నే నాతని ఆశ్రితను. అతని సుఖదుఃఖాల ఛాయను. నా భావం, నా వాక్కు, నా కర్మ సమస్తమూ అతనిదే. ఆనాడు వికసించని నా హృదయంలో ఉచ్చరించిన ఆ పవిత్ర మంత్రాల ఘోషతో నా సర్వస్వాన్ని అతని ఆధీనం చేశాను. కాని అతనో జడుడు. అతనిలో ప్రేమ, మార్దవం, మమత ఏ కోశానా లేవు.

రవీంద్ర పరిశోధన ఫలించింది. పూర్తిఅయిన తన పరిశోధన చూసి మురిసిపోయాడు. నేనుకూడా ఆతని ఆనందంలో నిర్లిప్తంగా భాగం పంచుకున్నాను. ఏదో ఆశ నాలో జనించింది. ఆశగా భవిష్యత్తులోనికి చూశాను. కాని ఆనాడు అతను చెప్పిన పిడుగులాంటి వార్త నన్ను ఒక్క క్షణం అంధకారంలోకి లాక్కుపోయింది.

రవీంద్ర విదేశాలకు పోతున్నాడు.

నేనూ వస్తానన్నాను. బ్రతిమిలాడాను. ఏడ్చాను. కాని రవీంద్ర సామాన్యుడు కాడు. అతడు అంగీకరించలేదు.

"సువర్ణా, నిజం ఈనాడు చెబుతున్నాను. నీవు ఉంటే నా కృషికి అంతరాయం. నీ విక్కడే ఉండు. నా ఆశయాలకు అవరోధం కల్పించకు. నేను తిరిగివచ్చేసరికి కాలేజీలో చేరి గ్రాడ్యుయేటువి కావాలి!" అన్నాడు గట్టి నిబ్బరంతో.

నా గుండెలు మండిపోయాయి. ఇతను మనిషేనా?

"మీరు మనిషి కారు. మీకు హృదయం లేదు, రవీంద్రా, మీకు హృదయం లేదు. వెళ్ళండి. నేను మీ కృషికి అంతరాయం కదూ? సుపర్ణను చంపి... మీ చేతులతో చంపి వెళ్ళండి" ఏడుస్తూ అన్నాను.

నా రెండుభుజాలు గుచ్చి పట్టుకొని నా కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు. "సుపర్ణా!"

"సుపర్ణ! ఎందుకీ సుపర్ణ!" —

"సుపర్ణా! నువ్వు సన్యాసం చేసుకోలేదు. పిచ్చిదాని వి. నాకూ హృదయముంది. ఆ హృదయిందో ప్రేమ ఉంది. ఆ ప్రేమతో నువ్వున్నావు. నన్ను క్షమించు. అఖండమైన కీర్తి ప్రతిష్ఠలతో తిరిగివస్తాను. నీకోసమే ఈ కృషి అంతా నన్ను నమ్ము."

తిరిగి అన్నాడు. "నా జీవితానికి, నా కృషికి కరదీపికవు నువ్వు."

"కరదీపికను!" వ్యంగ్యంగా అన్నాను.

"అవును, నా జీవిత ప్రదీప్తివి. నన్ను చిరునవ్వుతో పంపవా? నీ చిరునవ్వే నా కృషికి ప్రథమసోపానం."

నేను కర్కశంగా మొహాన్ని పక్కకి తిప్పుకున్నాను.

రవీంద్ర నన్ను క్షణం వీక్షించి నిట్టూర్పుతో వదిలి వెళ్ళాడు. వెళ్ళిపోతూన్న అతన్ని నాలో తెలియని ద్వేషభావంతో చూడసాగాను.

"నిన్ను ప్రేమించాను. దైవంగా ఆరాధించాను. నా సర్వస్వము నీ కర్పణ చేశాను. ఈనాడు స్వార్థంతో నన్ను విడిచి నిర్దాక్షిణ్యంగా, దూరంగా వెళ్ళిపోతున్నావు! ఈ వియోగాన్ని భరించలేను! నన్ను ఒంటరిదాన్ని చేసి వెళ్ళిపోకు!" పరుగున వెళ్ళి అతని కాళ్ళమీద పడి వెక్కి వెక్కి ఏడవాలనిపించింది. కాని 'అహం' అడ్డు వచ్చింది. అభిమానపూరిత హృదయంతో వెనక్కి తగ్గాను. దానికి మారుగా రెండు పెద్ద కన్నీటి బిందువులు నేలమీదికి జారి మట్టిలో ఇంకిపోయాయి.

రవీంద్ర వెళ్ళిన కొన్ని గంటలకే భయంకరమైన వార్త.

రవీంద్ర ప్రయాణిస్తున్న బోయింగ్ ప్లేన్ ఘోరప్రమాదానికి గురిఅయినదని, అందరూ మరణించారని.

ఆ వార్త విన్న నాలో అణుమాత్రమైనా చలనం కలగలేదు. అన్ని ఆశలు, కోరికలు నశించి జీవచ్ఛవమునై పిచ్చిగా నవ్వుకున్నాను. కసిగా భగవంతుణ్ణి తిట్టుకున్నాను. జీవితంలో అన్నీ పోగొట్టుకున్నాను. నా సర్వస్వం నాశనమైంది. నా జీవితానికి ఒక గమ్యం, ఒక స్థిరత్వం అంటూ లేకుండా పోయింది. చుక్కాని లేని నావలా కష్టాల సుడిగుండంలో గింగిరాలు తిరుగుతున్నది నా బ్రతుకు. నేను ఏ కలలు కన్నానో, ఏమి వాంఛించానో, ఏమి ఆశించానో అవన్నీ నా స్వప్నాల అంచులో పడి నలిగిపోయాయి. చైతన్యరహితమై సమస్తము పోగొట్టుకొని, చేష్టలుడిగిన నన్ను అందరు పిచ్చెక్కిందన్నారు. ఆ మాటలకు నిజంగా పిచ్చెక్కని నేను వాస్తవంగానే పిచ్చిదాన్నయిపోయాను. నేనే మయ్యానో, నాకేం జరుగుతూందో తెలిసికొనే పరిస్థితులను దాటిపోయాను. ఆనాడే శూన్యమైన నా జీవితంలోకి ఒక వ్యక్తి ప్రవేశించాడు. నా జీవితానికి ఒక ఆశను, అర్థాన్ని కలిగించాడు. నన్నూరడించాడు.

చుక్కాని లేని నా జీవననౌకకు చుక్కానిగా నిలిచాడు. అతని గుండెలమీద పడి గంటల తరబడి ఏడ్చి, నాలో కరుడుగట్టిన దుఃఖం అంతా తీర్చుకున్నాను. అతడు నాకు ఆప్తుడుగా, అన్నగా, తండ్రిగా నాకండ నిలిచాడు.

అతను డాక్టరు సారథి.

కాని లోకం ఈ అనుబంధాన్ని, సన్నిహితత్వాన్ని గర్హించింది. ఇద్దరిమధ్యా పెద్ద అగాధాన్ని సృష్టించింది.

కాని సారథి వాటన్నిటికి అతీతుడు.

కాని నేను లోకం వేసే అభాండాలకు హడలిపోయాను. దాని ఫలితంగా సారథి చూపిన వెలుగులోనించి భయంగా, భారంగా, అతను నా జీవితం అంతం కాలేదని, ఇంకా చాలా అనుభవించవలసిఉందని ఆత్మస్థైర్యంతో అడుగు పెట్టాను.

లోకం నన్ను తరళమనస్కురాలనని, పతితురాలనని వేలెత్తి చూపి, ఏవేవో అంటూ అతిహీనంగా చూడసాగింది. కాని సారథి నా భయాలన్నిటిని పోగొట్టాడు. నన్ను వాటికి అతీతురాలినిగా చేశాడు. నియమం, నిబంధనలు మనిషి తనకోసం ఏర్పరుచుకొన్నవి. నియమ నిబంధనలకోసం మనిషి లేడు. కాని కాలమే వాటిని అధిగమించుతుంది. క్రమక్రమంగా నా గత జీవితం మరిచిపోసాగాను.

నేనిప్పుడు పూర్వపు సుపర్ణను కాను. కలలు నిండిన కళ్ళతో, రవీంద్రనుండి ఏవేవో పొందాలనే తపనతో ఆశగా ఎదురుచూస్తూవచ్చిన అప్పటి సుపర్ణను కానిప్పుడు.

నా హృదయంలో ఆనాటి నా దుఃఖమయ జీవితంలోని నిగూఢాధ్యాయాలు ఎప్పుడో ఒకప్పుడు గుర్తుకువస్తూండేవి. కాని సారథి ప్రేమపుష్కరిలో అవన్నీ మరుగున పడిపోతూండేవి.

తిరిగి ఇన్నేళ్ళకు అతను — రవీంద్ర — గుర్తుకు వచ్చాడు. బరువుగా నిట్టూర్పు విడిచాను. కళ్ళనుండి వేడి కన్నీటిబిందువులు రాలసాగాయి.

కాలగర్భాన కలిసిపోయిన నా జీవిత మేదో కలిసిపోయింది. ఇప్పుడు చలించడానికికూడా వీల్లేని, అచంచలమైనదాన్ని నేను పొందగలిగాను.

ఒక్కసారి సుపర్ణకోసం కలవరించి, పలవరించి చనిపోయిన ఆ వ్యక్తిని చూడాలని నా మనస్సు ఉద్విగ్నమయింది. కాని, ఆ కోర్కె ఏలాంటిదో నాకు తెలియనిది కాదు. మరుక్షణంలోనే ఆ కోర్కె నాలో చచ్చిపోయింది.

రవీంద్ర చివరగా అన్న మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి.

"సుపర్ణా, నీకోసం తిరిగి వస్తాను."

నా ఆపాదమస్తకం కంపించింది. ఎక్కడో దూర దూరాలనుండి ఏవేవో కేకలు నా చెవులకు తాకసాగాయి.

"సుపర్ణా, నీకోసం వచ్చాను. సుపర్ణా, సుపర్ణా!"

భయంతో వణికిపోతూ శేషరాత్రిని అక్కడే ఆ డాబామీదనే గడిపివేశాను.


• • •

గడిచిన రాత్రి నిద్రలేమివల్ల మానసిక సంఘర్షణతో నలిగిపోయిన శరీరంతోబాటు మనస్సు నీరసించిపోయింది. భారమైన కనులతో, భారమైన మనస్సుతో ఒక్కొక్క క్షణము గడపసాగాను. కాని సాధ్యం కావడం లేదు.

కాని ఒక్కోసారి అనిపిస్తూంది, ఒక్కొక్క క్షణం ఆగి, అనంతమైన కాలావధిలో కరిగిపోతుందేమోనని.





టెరిలిన్ ముక్కలు



టెరిలిన్ పాంట్, షర్టు ముక్కలు
(1.25 & 2.25 మీటరు)
రెండు ముక్కల క్లియరెన్సు
అమ్మకపు ధర రు. 28-50.
వి. పి. పి. ఛార్జీలు రు. 2-50.

ARVIND AGENCIES (AP-...),
PO Box 1408, Delhi-6.

కౌటిల్యుని అర్థశాస్త్రము



వెల రు. 20

ఉగాదికి

రు. 18

ఆంధ్రప్రదేశ్ ... డిస్ట్రిబ్యూటర్సు

అంబటిపూడి శర్మ
గుంటూరు



" తెనాలికే ఆ చిరునవ్వు దేనికోసన్నా "
ఫోటో: ఎ. యస్. శాస్త్రి,
కూచిపూడి.

ఈ రోజులోని క్షణాలు భయంకరంగా నాలో పెరిగి, నన్ను మరీ మరీ కలతపొందిస్తున్నవి.

దేన్ని గురించి, ఎవరిని గురించి భయపడసాగానో అదే నిజంగా నా ఎదటికి రాసాగింది.

సరిగ్గా పదిగంటలకు రాముడు పోస్టు తెచ్చాడు. నా పేరు ఉన్న బరువైన కవరు. ఆ దస్తూరీ చూడగానే అసలే అంతంతమాత్రంగా ఉన్న నా హృదయం ఒక్క గడ్డిపోచలా గాలిలో ఎగిరిపోసాగింది.

ఆ దస్తూరి, చిరపరిచితమైన ఆ వ్రాత ఎవరిదో కాదు. నే నింతకాలం చనిపోయాడని భ్రమిస్తున్న రవీంద్రదే! గుర్తుపట్టడానికి ఒక్క క్షణంకన్నా ఎక్కువ పట్టలేదు. చనిపోయాడనుకున్న వ్యక్తి వ్రాసిన ఆ ఉత్తరం నాకే — కేవలం — నాకే వ్రాశాడు. అప్పటి నా హృదయంలోని భావాలు, నా మనస్సులోని ఆవేశాలు మాటల్లో వివరించలేను. అది నా ఊహకే మించినదిగా ఉంది.

అప్రయత్నంగా కవరు చించాను.

“సువర్ణా!

ఆశ్చర్యపడుతున్నావా! చనిపోయాడనుకున్న వ్యక్తి ఎలా బ్రతికి వచ్చాడా అని విభ్రాంతిపడుతున్నావా! లేదు. కాలం చేసే పనులకు అర్థం లేదు. మనం కోరుకున్నట్లు, అనుకున్నట్లు జరిగితే, మానవజీవితాలకు ఒక చరిత్ర లేదు. నిన్ను సంబోధించడానికి నే నీనాడు అర్హత కోల్పోయాను. అలా అనుకున్న ప్రతిక్షణం నా హృదయం రంపపుకోతతో నలిగిపోతూంది. నీకు తెలీదు నా బాధ. నా బాధకు అర్థం లేదు.

సువర్ణా! విధిముందు మృత్యువు ఆధిక్యం ఎంత? మానవ జీవితాలకు స్థిరత్వం ఏది? ప్రశాంతంగా జీవిస్తున్న నీకు తిరిగి దుఃఖం కలిగిస్తున్నాను. మనస్ఫూర్తిగా క్షమించు. ఆరోజున—నేనువెళ్ళేరోజున— చిరునవ్వుతో పంపలేకపోయావు. అవును. సౌజన్యం, ప్రేమ అనేవి ఎరగనివాణ్ణి. అలాంటి సమయంలో కూడా నీనుండి ఒక చిరునవ్వు వస్తుందని ఎలా భ్రమించానో, సువర్ణా! నా హృదయం నీకు తెలీదు. తెలుసుకోలేకపోయావు. నిజం. దానికి పూర్తిగా నేనే బాధ్యుణ్ణి.

తల్లిదండ్రుల ప్రేమకు దూరమై, అనురాగానికి, ఆప్యాయతకు, ఆత్మీయులకు నోచుకోని ఈ దిక్కులేని వాణ్ణి మీ నాన్నగారు కేవలం దయతో చేరదీశారు. నా జీవితానికి జీవం పోశారు. పైకి తీసుకువచ్చారు. ఆయన చూపిన దయార్ద్ర హృదయానికి, సహాయానికి ఏ విధంగా ప్రతిఫలం తీర్చుకోవాలో నాకు అర్థం కాని ఆ స్థితిలో ఆయన కోరిన కోరిక విని దిగ్భ్రాంతుడ నయ్యాను. అప్పటికే ఆయన ఎడల ఋణభారంతో మునిగి, ఎలా బయటపడాలో అర్థంకాని ఆ స్థితిలో ఆయన నిర్ణయం నేను నమ్మలేకపోయాను. ఆయన మాట ఏనాడు కాదనలేదు. లోపల చెలరేగే అల్లకల్లోలం పైకి తెలీనీకుండా, ఎలాగూ నువ్వే నిర్ణయాన్ని అంగీకరించవనే అంధవిశ్వాసంతో మరేమీ మాట్లాడలేకపోయాను. కాని నువ్వు అంగీకరించావని తెలియగానే నాకేం చెయ్యాలో తోచలేదు. ఏం చూసి నన్ను భర్తగా స్వీకరించాలనుకుంటున్నావో నా కర్థం కాలేదు. నిన్ను కలుసుకొని బ్రతిమిలాడి ఈ వివాహాన్ని తప్పించాలనుకున్నాను. కాని, సమయం లేదు. ఈనాడు నిజం చెబుతున్నాను. ఆనాడు నా హృదయంలో నీకొక ఉన్నతమైన స్థానం ఉంది. నేనేనాడు నిన్ను అతి హేయమైన మోహదృష్టితో చూడలేదు. మీ నాన్నగారి కోటలో ఒక రాజకుమారిలా పాలలవైపు షికారుగా వెళ్ళే నీవైపు చూడడానికే భయంగా ఉండేది. నీ అంతస్తువేరు నా అంతస్తువేరు. నీ లోకం వేరు నా లోకం వేరు నీమీద ఒక యజమాని, ఒక ఉన్నత ఆదర్శాల రూపకర్త్రి కుమార్తెవన్న గౌరవ భావంతప్ప నాలో మరే భావానికి తావు లేదు కాని మీ నాన్నగారు చేసిన ఆలోచనలేని పనికి ఎంతెంత బాధ పడ్డానో, భార్యగా నిన్ను ఎలా పరిగణించాలో, నీతో ఎలా జీవించాలో నాకు అర్థమయ్యేదికాదు. ఎన్నో విధాల ప్రయత్నించాను కాని నాకా భావం వచ్చేదికాదు. వైవాహిక జీవితంలో ఏ సంతోషమూ నీ కివ్వలేకపోయాను. ఆ వ్యధను, క్షోభను భరించలేక నా దృష్టి నంతా నా పరిశోధనలమీదికి మరల్చాను నా పరిశోధనలకు కావలసిన ఖర్చులకు నీ డబ్బు వాడుకున్నాను. ఇప్పటికే అన్నివైపులా మీ దయతో బందీనై ఉన్నాను. ఇంకా ఆ బందీతనాన్ని పటిష్ఠం చేసుకోవడానికి నా మనస్సంగీకరించలేదు. కారణంగా నీవు నాపై ఎంతో ఖేదపడసాగావు. నానుండి ఏ అనుభూతులూ పొందక, ఏ ఆప్యాయతా లభించక అమాయికంగా నిద్రించే నిన్ను రాత్రులందు చదువుతూ చదువుతూ మధ్యలో మానేసి నీ ప్రక్కనే కూర్చొని గంటల తరబడి నీ మోహాన్ని వీక్షిస్తూ గడిపేవాణ్ణి. నిర్మలమైన నీ మొహంమీద విసుగుతోను, నిరాశతోను నిండిన అస్పష్టరేఖలను చూసి ఆంతర్యంలో ఎంతో బాధతో కుమిలిపోయేవాణ్ణి కాని ఇది నీకు తెలీదు. నిన్ను సుఖపెట్టాలని, ప్రేమవాహినిలో ఓలలాడించాలని కలలు కన్నాను. కాని నీ మొహంలోకి చూడగానే ఏమీ చేతగానివాణ్ణి అయిపోయేవాణ్ణి.

ఆనాడు విమాన ప్రమాదంలో ఎలా బ్రతికి బయటపడ్డానో నాకే తెలీదు. మొదటిసారిగా స్పృహలోకి వచ్చాక అనిపించింది, 'నీకోసమే నేను బ్రతికా నని' 'నీ ప్రేమే నన్ను బ్రతికించిం దని.' డాక్టర్లదగ్గిర గోలుగోలున విలపించాను. ఆంతర్యంలో చేతులెత్తి భగవంతుణ్ణి వేడుకున్నాను. “నాకోసం సువర్ణ ఆశగా ఎదురుచూస్తూంటుంది. నా చావు ఆమె జీవితాన్ని బలిగొంటుంది” అని.

నిజం. చివరికి నీ ప్రేమే నన్ను చిరంజీవిని చేసిందని భ్రమించాను. కాని, ఆనాడు నాకేం తెలుసు, అనంతమైన దుఃఖాన్ని భరించడానికే నేను బ్రతికానని? అవిటివాడనై ఎన్నో నెలలు హాస్పిటల్‌లో ఉండి నీకోసం ఆశతో అతి కష్టంమీద ఇండియా చేరాను. వెంటనే నీకు ఉత్తరం వ్రాశాను. జవాబు లేదు. ప్రాణాలు గుప్పెటలో పెట్టుకొని మీ ఊరు వెళ్ళాను. నీ గురించి తెలిసింది. స్థాణువునే అయ్యాను! అవును, నాది స్వార్థంకాక, సువర్ణ నాకోసం నిరీక్షిస్తూ ఉంటుందను కోవడం ఎంత అవివేకం? ఎందుకోసమని సువర్ణ నాకోసం ఎదురుచూడగలదు? కోరిన కోరికలన్నీ సఫలం కాకపోయినా జీవితం అంతంకాదు. ప్రాణం ఉన్నంతవరకూ మానవధర్మం నిర్వర్తించవలసిన విధి ఉంది. సాధ్యమైనంతవరకూ జీవితాన్ని సార్థకం చేసుకోవాలనే తపన ఎవరికి ఉండదు?

ఎన్నో ఆశలతో నాకోసం ఎదురుచూస్తూంటావని, నా చావు నిజం అనిపించినా నువ్వు నమ్మలేవని తలంచి, అదే భ్రమతో వచ్చాను. కాని నువ్వు నాకోసం ఎదురు చూడడంలేదని అనిపించిన ఆ క్షణంలో నేనేమయిపోయానో, నేనేం కోల్పోయానో నా కష్టం అయింది. నే నేనాడు నీ ఎదుట నా హృదయాన్ని విప్పి చెప్పలేదు. నా చర్యలు నీకు నాపై ఏవగింపు, అసహ్యం కలిగించాయి. నే నన్నివిధాల నీకు తీరని ద్రోహం చేశాను.

ఆనాడు అన్నీ ఉండే నీకు సుఖాన్ని ఇవ్వలేదు ఈనాడు అన్నీ పోగొట్టుకొని అవిటివాడనై, రోగిష్ఠిగా ఉండి నీకేం ఇవ్వగలను?

ఆనాడు డాక్టర్లతోను, భగవంతునితోను దెబ్బలాడి బ్రతికాను. కాని ఈ క్షణాన నాకు చావునిమ్మని భగవంతుణ్ణి హృదయపూర్వకంగా వేడుకుంటున్నాను.

ఈ రెండిటి కోరికలమధ్య ఎంతటి వైవిధ్యం!

ఆ క్షణాన ఎవరికోరకై ఆశతో బ్రతకాలని కోరుకున్నానో, ఈ క్షణాన వారికోసమే నిరాశతో చావు కావాలని వేడుకొంటున్నాను.

కాని కృశించిపోతున్న ఈ గుండెల్లో ఒకే ఒక కోరిక నిలిచిపోయింది. చనిపోకముందు ఒకసారి నిన్ను చూడాలని, నీ మొహంమీది మధురమైన చిరునవ్వును వీక్షించాలని, ఒక్కసారి నీ నోటినుండి 'రవీంద్రా! మీకూ హృదయముంది' అని అంటే వినాలని ఉంది. మనసారా కోరుకోవడం నేరమే అంటావా?

> **నేరాలు**
>
> మానవుని దారుణ శత్రువులు అతను చేసిన నేరాలే. అతను తప్పుకున్న గోతిలోకి నడిపించే వరకూ అవి అతన్ని నీడల్లా అనుసరిస్తూంటాయి.
>
> — రోషఫోకాల్డ్

ఒకనాడు నీ హృదయమార నామీద ఆశతో, మమతతో నాకోసం నిరీక్షించావు. అమృతమయమైన నా ప్రణయమధుభాండాన్ని నేనే చేతులారా విషతుల్యం చేసుకున్నాను. ఇక నాకీ జీవితంలో ఏ అనుభూతీ వద్దు. రోగస్థుణ్ణాయి, చివరి గడియల్లో ఉన్న నేను నీనుండి ఒకటే కోరుకుంటున్నాను. ఈ ఉత్తరం చదివాక ఒక్క క్షణం క్షణమాత్రంగా నీ హృదయంలో అనుకో, 'రవీంద్రకూ హృదయముంది' అని. ఈ అనుభవమే, అనుభూతే చాలు. అస్తాద్రిలో మునిగిపోతున్న నా జీవితానికి మిక్కుటి విలువైన తృప్తి, ఆత్మశాంతి ఏర్పడతాయి.'

— రవీంద్ర.”

భారభరితమైన మనస్సుతో ఉత్తరం చదవడం ముగించాను. నా చుట్టూఉన్న పరిసరాలు గిరగిర తిరుగుతూన్నట్లు అనిపిస్తూంది. నా తల తిరిగిపోతూంది. కూర్చున్న సోఫా గట్టిగా పట్టుకున్నాను కళ్ళమీద ఏదో పొర. అంతే! నాకేమవుతూందో తెలీదు.

కాని ఒకటి లీలగా గుర్తు, విస్మృతిలో పడిపోతున్న నా కళ్ళకు దూరంగా సారథి నావైపుకు పరుగున రావడం కనిపించింది.